థ్యాంక్యూ సీఎం సార్



రాబోయే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితాను ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య నందిత మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.
–సాక్షి, సిటీబ్యూరో

నేడు ఐనోన్ చర్చి వార్షికోత్సవాలు

లాలాపేట: తార్నాకలోని ఐనోన్ చర్చి 34వ వార్షిక మహోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్. విలియం కేరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయ డెయిరీ సమీపంలో ఉన్న చర్చిలో సాయంత్రం 6 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు.

కళాసిల్క్ ఎగ్జిబిషన్ ప్రారంభం



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలో కళాసిల్క్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. చేనేతకు చేయూతనిద్దాం, మన సాంప్రదాయాన్ని కాపాడుకుందాం నినాదంతో కళాసిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శన ప్రారంభించినట్లు ప్రతినిధి వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శనలో 50 స్టాళ్లు ఏర్పాటు చేశామని హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్, చేనేత, పోచంపల్లి, ఇక్కత్ భాగల్పూర్ సిల్క్, బెంగాలీ కాటన్, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, జ్యూట్‌బ్యాగ్స్, వన్‌గ్రామ్ జువెలరీ అందుబాటులో ఉంటాయన్నారు.

అభినందన



సనత్‌నగర్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడిగా నియమితులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహకు సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్, నాయకులు రమేష్, కమల్‌రాజతో కలిసి గాంధీభవన్‌లో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

డిప్యూటీ మేయర్‌కు వినతి

లాలాపేట: తార్నాకలోని హెచ్ఎండీఏ కాంప్లెక్స్ నుంచి ఓయూ క్యాంపస్‌లోనికి వెళ్లే గేటును తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని నాగార్జుననగర్ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉదయం వేళ వాకింగ్‌కు వెళ్లాలంటే చాలా దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఉదయం మూడు గంటల పాటు గేటు తెరిచి ఉంచేలా అధికారులతో మాట్లాడాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న సన్‌రైస్ యూనివర్సిటీ బృందం

అడ్డగుట్ట: అడ్డగుట్టకు చెందిన జోషి గోపి పూజారికి సన్‌రైస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. కోవిడ్ సమయంలో సామాజిక సేవలో భాగంగా ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు, పలు సేవలు అందించిన గోపి పూజారిని సోషల్ యాక్టివిస్ట్‌గా గుర్తించి మంగళవారం మడ్ గోవాలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

చెక్కు అందజేత

కంటోన్మెంట్: నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవనిలా పనిచేస్తోందని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు పెన్షన్‌లైన్‌కు చెందిన షేక్ ఇలియాజ్‌కు మంజూరైన రూ.44 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, నళిని, హసీన్ ఖాన్ పాల్గొన్నారు.

లోకేష్‌యాదవ్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిశోధన విద్యార్థి డాక్టర్ లోకేష్‌యాదవ్‌ను ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం ఘనంగా సన్మానించారు. పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీని సాధించడంతో పాటు ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించినందుకు విద్యార్థులు, విద్యార్థి నేతలు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

ప్రజావసరాలకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రజావసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చేందుకు ఎన్ని కోట్ల నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా డివిజన్లలో త్వరలోనే రూ.30 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. అమీర్‌పేట డివిజన్ ప్రజల మంచినీటి అవసరాల కోసం నూతన రిజర్వాయర్ నిర్మాణం, నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ మెయిన్ రోడ్డుపై ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ, డివైడర్ల పెండింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 60 ఫీట్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈఎస్ఐ స్మశానవాటిక అభివృద్ధి పనులకు వచ్చేవారం శంకుస్థాపన చేయడం జరుగుతుందని, అందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో అత్యధిక పార్కులు ఉన్నాయని, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఇందుకోసం అవసరమైన స్థలాలను సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమీక్షలో డీసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ భార్గవ్ పాల్గొన్నారు.

త్వరలోనే అర్హులకు డబుల్ ఇళ్లు..

కంటోన్మెంట్: అర్హులైన వారికి త్వరలోనే డబుల్ బెడ్రూమ్‌లు కేటాయిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్మించిన ఇళ్ల కేటాయింపుపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మారేడ్‌పల్లి, మడ్‌ఫోర్ట్ తదితర ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. తొలి విడతలో అర్హులైన వారికి కేటాయించామని, మిగతా వారికీ కేటాయిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగు విచారణ జరిపి అర్హులను గుర్తించి జాబితాను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మించిన ఇళ్ల కేటాయింపునకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ నెల 24 వ తేదీన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇందుకోసం ర్యాండో మైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బన్సీలాల్ పేట కార్పొరేటర్ హేమలత, లాస్య నందిత, డీఆర్ఓ వెంకటాచారి, సికింద్రాబాద్ ఆర్డీఓ రవి, హౌసింగ్ ఈఈ వెంకటదాసు రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న కొలను బాల్‌రెడ్డి

అభినందనల వెల్లువ

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. నాంపల్లి, కంటోన్మెంట్, సికింద్రాబాద్, అంబర్‌పేట తదితర నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ బస్తీలు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, ఆకుల రూప, మల్లికార్జున్‌గౌడ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, శ్రీహరి, సరాఫ్ సంతోష్, నారాయణరాజు, అమీర్‌పేట గురుద్వారా సమాజ్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

తొమ్మిదేళ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సురేష్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణారావు

సనత్‌నగర్: ఐదారు దశాబ్దాలుగా జరగని వందల కోట్ల రూపాయల అభివృద్ధి ఈ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలో 18వ రోజు మంగళవారం బేగంపేట డివిజన్‌లోని శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారికాలనీ, పోచమ్మబస్తీ, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు యావత్ దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కూకట్‌పల్లి నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఫ్లైఓవర్లు, వైకుంఠధామాలు, థీమ్ పార్కులు, మంచినీటి రిజర్వాయర్లు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్‌హాళ్ల నిర్మాణంతో పాటు అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్‌యాదవ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు సతీష్ అరోరా, శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అడ్డగుట్టను సమస్యలు లేని డివిజన్‌గా మారుస్తా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: సమస్యల రహిత డివిజన్‌గా అడ్డగుట్టను రూపుదిద్దుతున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. డివిజన్‌లో రూ. 1.39 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు తమను ఆదరిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అడ్డగుట్ట ప్రజల చిరకల కోరికైన ఆస్పత్రి నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నామని, అందుకోసం ప్రభుత్వం నుంచి రూ. 13.05 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ స్రవంతి, జీహెచ్ఎంసీ ఏఈ వేణు, కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, కొంతం దీపిక, నేతలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, లింగాని శ్రీనివాస్, కిషోర్‌గౌడ్, రామేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, మనోహర్, సత్తయ్య, పొన్నాల రాజు పాల్గొన్నారు.

అభినందన..

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జూపల్లి శ్రీనివాస్ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను అడ్డగుట్టలో కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో పద్మారావుగౌడ్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మొలుగు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, విశాల్, సలీం, నవాజ్ ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న కోట నీలిమా

బన్సీలాల్‌పేట్: జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ మేకలమండి ప్రాంతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మంగళవారం ఆమె సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గతంలో ఔట్ సోర్సింగ్, ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఏమైయిందని ప్రశ్నించారు. ఐదు రోజుల నుంచి ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించపోవడం దారుణమన్నారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగులను విస్మరించడం తగదన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు వై. క్రిష్ణ మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ సాధించే వరకు ఆందోళన ఆగదన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు తమను వేధిస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు కాంగ్రెస్ నాయకులు నస్రీన్‌బేగం, మధు, రమేష్ బాబు, చిరంజీవి, షాహిద్‌బేగం పాల్గొన్నారు.

సుపరిపాలనకు 'డబుల్ ఇంజిన్' సర్కారు రావాలి



మాట్లాడుతున్న పరాగ్ అల్వాని

లాలాపేట: తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని ముంబై ఎమ్మెల్యే పరాగ్ ఆల్వానీ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం తార్నాకలోని మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి నివాసంలో సికింద్రాబాద్ నియోజకవర్గం మేధావులు, అడ్వకేట్లు, యూనివర్సిటీ అధ్యాపకులు, కాలనీ అసోసియేషన్స్ ప్రతినిధులు, కులసంఘాల నాయకులతో సమావేశమయ్యారు. గత తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశంలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. తెలంగాణలో సుపరిపాలన కోసం డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నాగేశ్వర్‌రెడ్డి, వర్మ, గణేష్, వీరన్న, హరి, శారదా మల్లేష్ పాల్గొన్నారు.

లాస్యకు ఎమ్మార్పీఎస్ నేతల మద్దతు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందితను ప్రకటించడం పట్ల స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇటుక శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో లాస్య నందితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన సాయన్న వారసురాలిగా లాస్య ఎమ్మెల్యేగా గెలవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. లాస్యను కలిసిన వారిలో కళ్యాణ్ అజిత్, శ్రీకాంత్ ఉన్నారు.



లాస్య నందితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎల్ఎస్ ప్రకాష్ సేవలు మరువలేనివి



ఎల్ఎస్ ప్రకాష్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేసిన గొప్ప నాయకులు ఎల్ఎస్ ప్రకాష్ అని సీపీఐ రాష్ట్ర నాయకురాలు ప్రేమ పావని కొనియాడారు. మంగళవారం అడ్డగుట్ట బస్టాండ్ వద్ద సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఎల్ఎస్ ప్రకాష్ వర్ధంతిలో ప్రేమ పావని పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరానికి పొట్టకూటికై వచ్చిన బలహీన వర్గాలకు చెందిన 5 వేల మంది ప్రజలకు గుడిసెలు వేయించి పట్టాలు ఇప్పించిన ఉద్యమ నేత ఎల్ఎస్ ప్రకాష్ అని పేర్కొన్నారు. పేద వర్గాలకు చెందిన వారికి కుట్టు మెషిన్లు, రిక్షాలు ఇప్పించి వారందరికీ ఉపాధి బాటలు వేసి, సీపీఐ పార్టీకి బలమైన పునాదులు వేసి అడ్డగుట్టను ఎర్రజెండాల అడ్డాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల నళిని, బాబు, జంగయ్య, యాదగిరి, సోమయ్య, లతీఫ్, రషీద్, శంకరయ్య, రంజిత్‌సింగ్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: సీట్ల కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ ఆరోపించారు. బీసీలకు తక్కువ ఎమ్మెల్యే సీట్ల కేటాయింపును నిరసిస్తూ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో 7 శాతం జనాభా గల ఓసీలకు 60, 60 శాతం జనాభా గల బీసీలకు కేవలం 23 సీట్లను కేటాయించడం దారుణమన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎక్కడ పర్యటించిన ఆందోళనలతో అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఓంకార్, సాయిగౌడ్, మహేష్, వినోద్, సతీష్, రాజు, సందీప్, వెంకన్న, శివకుమార్, రమేష్, జానీ పాల్గొన్నారు.

బీసీ సీఎం సాధన సమితి ఏర్పాటు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి ఏర్పాటు చేసినట్లు ఓయూ న్యాయకళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణకు బీసీ సీఎం కావాలనే లక్ష్యంతో రెండేళ్లుగా పని చేసిన సదరన్ పొలిటికల్ అకాడమీని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితిగా మార్చినట్లు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలోను తెలంగాణ ఏర్పాటు తర్వాత 52 శాతం గల బీసీలు ముఖ్యమంత్రి పదవీ చేపట్టలేదన్నారు. బీసీని ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ఏడేళ్ల సర్వీసు ఉన్న ప్రొఫెసర్ ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసినట్లు వెల్లడించారు.

అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

అడ్డగుట్ట: సరూర్‌నగర్ మండల పరిధిలోని నందనవనంలో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యువకులందరూ మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడుతూ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, తక్షణమే మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించి బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కారు ఢీకొని యాచకుడి మృతి

లాలాపేట: కారు ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. ఈ నెల 21న ఏకో కార్ స్పోర్ట్స్ డ్రైవర్ తార్నాక చౌరస్తాలోని పెట్రోల్ వేసుకుని వెళ్తున్న క్రమంలో దాదాపు 60 ఏళ్ల వయస్సును యాచకుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా వివరాల ప్రకారం.. లాలాపేట జనప్రియ విల్లా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న రాజేందర్ కుమార్ (43) ఇది వరకు ఆర్టీసీలో మెకానిక్‌గా పని చేసేవాడు. కొద్ది కాలం క్రితం పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రాజేందర్ కుమార్ కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

భవన కార్మికులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మహేందర్

సికింద్రాబాద్: భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం వారాసిగూడలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులు తినడానికి తిండి లేక, ఉండడానికి గూడు లేని నిరుపేదలని అర్హులను గుర్తించి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీడబ్ల్యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేందర్, కృష్ణ, కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారి శ్రీశైలం, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, కొండయ్య, పర్శురాములు, సహాయ కార్యదర్శులు మల్లేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రభాకర్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

సికింద్రాబాద్: ఆటో డ్రైవర్లపై రైల్వే అధికారుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమరెల్లి బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపిన అనంతరం మాట్లాడారు. ఆటో నడుపుకొని బతుకుతున్న వందలాది మందికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ నంబర్ ప్లాట్ ఫాంలో పార్కింగ్ స్థలం కేటాయించకుండా, కేవలం ఎనిమిది నిమిషాల నిబంధన పెట్టి రైల్వే అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిబంధన ద్వారా ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్లే ఎనిమిది నిమిషాల నిబంధన ఎత్తివేసి 10వ ప్లాట్‌ఫాంలో ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. జంగయ్య, రాములు, ఆంజనేయ గౌడ్, మందల రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో అన్నీ శుభాలే



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జనార్దన్ రెడ్డి

కంటోన్మెంట్: ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెరగడంతో అన్నీ శుభాలే కలుగుతాయని కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి (కేజేఆర్) అన్నారు. బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలోని యోగాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొడకంచి రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నాగ్‌పూర్ హైవేపై ఉన్న యోగాంజనేయ స్వామి దేవాలయ భక్తుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి స్వామివారికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుపతిరెడ్డి, పద్మారెడ్డి, కొడకంచి రాజేందర్ యాదవ్, జగన్మోహన్ రెడ్డి, సిద్దిరామి రెడ్డి, కామేశ్వర రావు, సుశీల్, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్ గ్రూప్ పోటీల్లో సత్తా

రసూల్‌పురా: ఢిల్లీలో జరిగే ఎన్‌సీసీ కేడేట్ల ఆల్ ఇండియా తళ్ సైనిక్ పోటీల్లో పాల్గొనే సికింద్రాబాద్ గ్రూప్ లోని కేడేట్లు తిరుపతిలో జరిగిన ఇంటర్ ఎన్‌సీసీ గ్రూప్ పోటీల్లో సత్తా చాటారు. ఆగస్టు 10 నుంచి 19 వరకు జరిగిన ఇంటర్ ఎన్‌సీసీ గ్రూప్ పోటీల్లో వివిధ విభాగాల్లో 13 పతకాలను సాధించారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జీపీ కమాండర్ కల్నల్ సంజయ్ సయల్ వారిని సత్కరించారు.



ఎన్‌సీసీ కేడేట్లతో కల్నల్ సంజయ్ సయల్